క్లుప్తంగా

హర్యానా గవర్నర్ దత్తాత్రేయతో భేటీ



గవర్నర్ దత్తాత్రేయతో అశ్రిత

ముషీరాబాద్: ఇండో కెనడియన్ యూత్ కౌన్సిల్ అధ్యక్షురాలు రోయ్యూరు అశ్రిత హైదరాబాద్‌లో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను మర్యాదపూర్వకంగా కలిశారు. కెనడాలో ఉన్న భారతీయ యువకుల సమస్యలపై చర్చించారు. ఆమెతో పాటు తండ్రి రోయ్యూరు శేషసాయి ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ




చెక్కును అందజేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

నల్లకుంట: నల్లకుంటకు చెందిన పావని అనారోగ్యానికి గురై ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సలు పొందారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఆమె ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న నల్లకుంట కార్పొరేటర్ అమృత ఈ విషయాన్ని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి రూ. 54 వేలు మంజూరు చేయించారు. సోమవారం ఈ చెక్కును కేంద్రమంత్రి బాధితురాలికి అందజేశారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు కె.లక్ష్మణ్‌కుమార్, హైదరాబాద్ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి జ్యోతి పాల్గొన్నారు.

మార్కండేయ జయంతి

అంబర్‌పేట: భక్త మార్కండేయ జయంత్యుత్సవాలు ఘనంగా జరిగాయి. సోమవారం బాగ్‌అంబర్‌పేటలోని సేవా యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రచ్చ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఒగ్గుడోళ్ల నృత్యాలతో పల్లకి సేవ చేయగా పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. మాజీమంత్రి కృష్ణయాదవ్, బాబ, పద్మశాలి సంఘం ప్రతినిధులు హాజరుకాగా.. అనంతరం అన్నదానం నిర్వహించారు.

నేషనల్ ఇంటిగ్రేషన్ అవార్డుల ప్రదానం



రమేష్‌రెడ్డిని సత్కరిస్తున్న వేణుగోపాలాచారి తదితరులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: హెల్త్‌కేర్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో రిపబ్లిక్ డే సందర్భంగా పలు రంగాల్లో సేవలందిస్తున్న వాకర్స్ క్లబ్ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, మాధవిలత, డాక్టర్ యాకూబ్‌పాషా తదితర ప్రముఖులను నేషనల్ ఇంటిగ్రేషన్ అవార్డులతో ఘనంగా సత్కరించారు. మాజీ ఎంపీ ఎస్.వేణుగోపాలాచారి, బీసీకమీషన్ చైర్మన్ కృష్ణమోహన్, తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, నిర్వాహకులు చంద్రశేఖర్ తదితరులున్నారు.

వ్యాపారులకు నష్టం జరగకుండా చర్యలు

కవాడిగూడ: ముషీరాబాద్ చౌరస్తా నుంచి వైస్రాయ్ హోటల్ వరకు జీహెచ్‌ఎంసీ అధికారులు చేపట్టే రోడ్డు విస్తరణలో స్థానిక వాణిజ్య సముదాయాలకు ఇళ్ల యజమానులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. బోలక్‌పూర్‌హౌస్ వద్ద కవాడిగూడ, ముషీరాబాద్ ట్రేడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన కేలండర్‌ను ఆయన ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు రాకేష్, సంజీవ్ కుమార్, రాజు, గణేష్, శ్రీనివాస్‌రావు, గోరక్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

'భావ ప్రకటన స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన హక్కు'

కవాడిగూడ: భావ ప్రకటన స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన హక్కు అని దానిని కాపాడుకునే బాధ్యత పౌరులందరిపై ఉందని సీపీఎం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బీ.వీ.రాఘవులు, న్యూ డెమొక్రసీ నాయకులు సాధినేని వెంకటేశ్వరరావు, గోవర్ధన్, కవిజయరాజ్‌లు పేర్కొన్నారు. సోమవారం స్వేచ్ఛ జేఏసీ ఆధ్వర్యంలో లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అబేద్కర్ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా భావ ప్రకటన స్వేచ్ఛ హక్కులను కాపాడుకుందామని నినాదాలు చేశారు. వివిధ పార్టీ ప్రజా సంఘాలు, మహిళా సంఘాల నాయకులు సంజీవ, ఝాన్సీ, స్వరూప, జ్యోతి, ప్రకృతి, స్కైలాబ్‌బాబు, శోభారాణి, శ్రీరాంనాయక్, పరశురాం, నాగరాజు, ప్రదీప్ తదితరులున్నారు.

కంటి 'వెలుగు'..!

సందర్శించిన మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యేలు



బాగ్‌అంబర్‌పేట్‌లో మంత్రి తలసాని, ఎమ్మెల్యే కాలేరు

కవాడిగూడ: కంటి వెలుగు గొప్ప కార్యక్రమం అని ప్రజలంతా భాగస్వాములై విజయవంతం చేయాలని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ప్రజలు కంటిచూపు సంబంధిత సమస్యలతో బాధపడకుండా ఉండేందుకు సీఎం కేసీఆర్ కంటివెలుగుకు రూ.250 కోట్లు కేటాయించారన్నారు. బోలక్‌పూర్ తాళ్ల బస్తీ కమ్యూనిటీహాల్‌లో సోమవారం కంటివెలుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముఠాగోపాల్‌తో కలిసి మంత్రి సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. డాక్టర్ శ్రీనివాస్, నవీన్, శ్రీనివాస్‌రావు, శంకర్‌గౌడ్ తదితరులున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం..

చిక్కడపల్లి: శరీరంలో కళ్లు ప్రధానమైనవని ఆద్య ఐ కేర్ సెంటర్ డైరెక్టర్ ప్రముఖ నేత్ర వైద్య నిపుణురాలు ఆర్. పల్లవి గుప్తారెడ్డి అన్నారు. సోమవారం గాంధీనగర్‌లోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ శిబిరంలో 250 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. 150 మంది విద్యార్థులు కంటి సమస్యలతో బాధపడుతున్నారని వారిలో 6 మంది విద్యార్థులకు స్క్వింట్‌ఐ సమస్య ఉందని గుర్తించామన్నారు. విద్యార్థులకు తగిన సలహాలు, సూచనలు చేసి వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలి..

అంబర్‌పేట: కంటి సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమాన్ని చేపట్టిందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. రాష్ట్రంలో రూ.250 కోట్ల ఖర్చుతో కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగిస్తుందన్నారు. సోమవారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ రామకృష్ణనగర్ కమ్యూనిటీహాల్‌లో స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌తో కలిసి కంటివెలుగు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. కంటి సమస్యలతో వచ్చిన వృద్ధులతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. కంటివెలుగు కేంద్రాల్లో ఏవైనా సమస్యలు తలెత్తితే తక్షణమే స్థానిక ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకొస్తే సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటానన్నారు.



సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు మంత్రి తలసాని, ఎమ్మెల్యే ముఠాగోపాల్

కంటి పరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహించాలి..

కాచిగూడ: ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహించాలని బీఆర్‌ఎస్ కాచిగూడ డివిజన్ ప్రధాన కార్యదర్శి సదానంద్ సూచించారు. సోమవారం కాచిగూడ, విక్రమ్‌నగర్ బస్తీలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరంలో బీఆర్‌ఎస్ నేతలు పాల్గొని కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఉచిత కంటి వైద్య సేవలను వైద్యులు, సిబ్బంది అందిస్తారని పేర్కొన్నారు. 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు కంటి పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. బీఆర్‌ఎస్ నేతలు దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, బబ్లూసింగ్, అంటోని, ఆనంద్, రాజేష్ తదితరులున్నారు.

'ప్రజా సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం'



ప్రజాసమస్యలు తెలుసుకుంటున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

అంబర్‌పేట: క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. పై మెరుగులతోనే అభివృద్ధి పనులు చూపిస్తుందని ప్రజలకు కనీస సౌకర్యాలను కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతుందన్నారు. సోమవారం అంబర్‌పేటలో స్థానిక బీజేపీ నేతలు, ఆయా విభాగాల అధికార యంత్రాంగంతో కలిసి ఆయన పాదయాత్ర నిర్వహించారు. అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తా, ప్రేమ్‌నగర్, న్యూప్రేమ్‌నగర్, పటేల్‌నగర్, నరేంద్రనగర్, చెన్నారెడ్డినగర్, బాపూనగర్, మున్సిపల్ కాలనీల్లో పర్యటించారు. రోడ్డు సమస్యలను స్థానికులు కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మ్యాన్‌హోళ్ల లోప్రెషర్, నీటిసరఫరా, రేషన్‌కార్డులు, ఆసరా పింఛన్లు వంటి సమస్యలను ఆయనకు వివరించారు. ఈ సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్టు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదల రేషన్‌కార్డులను తొలగించడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. బీజేపీ నాయకులు గౌతమ్‌రావు, వెంకట్‌రెడ్డి, శ్యామ్‌రాజ్, అజయ్‌కుమార్, నాగభూషణంచారి, జగన్, ఆనంద్‌గౌడ్, భిక్షపతి, రమేష్‌యాదవ్, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రపంచ దేశాలకు నేతాజీ స్ఫూర్తి



కాచిగూడ: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంత్యుత్సవాలు కాచిగూడలో ఘనంగా నిర్వహించారు. సోమవారం శివసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి సుదర్శన్, యువసేన రాష్ట్ర అధ్యక్షుడు గణేష్‌లు నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలకు నేతాజీ చూపిన మార్గాలు ఆదర్శమన్నారు.

- కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ తన కార్యాలయంలో నివాళులర్పించారు.
- మనిషి ఎంత కాలం జీవించాడనే కంటే, ఎలా జీవించాలో తెలిపిన మహనీయుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు. భారత సైనికదళం రూపకర్త నేతాజీకి భారతరత్న ప్రకటించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. దయానంద్‌రావు, శ్రీధర్, వినోద్‌కుమార్, గోవింద్, శ్రీనివాస్, మనోజ్, ప్రభాకర్ తదితరులున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో మంటలు.. తప్పిన ప్రమాదం



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ముఠాజైసింహ

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ హరినగర్‌లోని ఓ ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి భారీ ప్రమాదం తప్పింది. వినోద్, స్రవంతి దంపతులు తమ ఇద్దరు చిన్నారులతో కలిసి నివసిస్తున్నారు. భర్త జలమండలిలో బిల్ కలెక్టర్ కాగా.. భార్య ఇంట్లో పనులు చేస్తుంది. రోజూ మాదిరిగానే ఆమె పిల్లలను ఇంట్లో ఉంచి బయట నుంచి గడియపెట్టి పనికి వెళ్లింది. కొద్దిసేపటికి ఇంట్లోంచి దట్టంగా పొగలు రావడంతో చిన్నారుల అరుపులు వినిపించాయి. అటుగా వెళ్తున్న డెలివరీ బాయ్ కిటికీ దగ్గరకు వెళ్లి పరిశీలించాడు. వెంటనే బయట నుంచి పెట్టిన గడియను తీసి చిన్నారులను బయటకు తీసుకొచ్చాడు. స్థానికుల సాయంతో ఇంట్లోని మంటలను ఆర్పివేశారు. అప్పటికే ఇంట్లోని వస్తువులు, రూ.15 వేల నగదు పూర్తిగా దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ రవిచారి, ముఠా జైసింహ తదితర నాయకులు వచ్చి బాధిత కుటుంబానికి సాయం అందజేశారు. ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఘటనపై విచారణ చేపట్టారు.

కొనసాగుతున్న ట్రాఫిక్ అవగాహన సదస్సులు



నల్లకుంట: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని బేగంపేట టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించి మైనర్లు వాహనాలు నడిపితే కఠినచర్యలు తీసుకోవడంతో పాటు మైనర్లకు వాహనాలు ఇచ్చే వారిపై కూడా కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. సోమవారం ఓయూ ఎన్‌సీసీ సమీపంలోని అరబిందో ఇంటర్నేషనల్ హైస్కూల్‌లో టీటీఐ బేగంపేట ఆధ్వర్యంలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధాన కూడళ్లలోని సిగ్నల్స్ వద్ద ఏర్పాటు చేసే స్టాప్‌లైన్, ఫ్రీ లెఫ్ట్, ప్రధాన రహదారుల్లో ఉండే వివిధ రకాల గుర్తులను గురించి వివరిస్తూ.. కొత్త మోటారు వెహికల్– 2019 యాక్ట్‌లో వచ్చిన మార్పుల గురించి వివరించారు. నల్లకుంట లా అండ్ ఆర్డర్ సెక్టార్–2 ఎస్సై రమాదేవి, నల్లకుంట, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎస్సై, విద్యార్థులున్నారు.

డ్రగ్స్ విక్రేత రిమాండ్

అంబర్‌పేట: గుట్టుచప్పుడు కాకుండా నిషేధిత డ్రగ్స్ విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అంబర్‌పేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ హెచ్.ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడ మధురానగర్‌కు చెందిన భరత్ తుక్రాల్ (50) ముంబాయికి చెందిన సమీర్ అనే వ్యాపారి నుంచి నిషేధిత డ్రగ్స్ కొనుగోలు చేసి హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో అవసరమైన వారికి విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో అంబర్‌పేట్ అలీకేఫ్ చౌరస్తా వద్ద ఓ డ్రగ్స్ విక్రయానికి ప్రయత్నిస్తుండగా విశ్వసనీయ సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి రూ.15 వేల విలువైన 15 గ్రాముల నిషేధిత మెథాంఫేటమిన్ డ్రగ్‌తో పాటు ఓ సెల్‌ఫోన్, ఓ కారును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. గతంలో కూడా మాదక ద్రవ్యాలు విక్రయిస్తూ పట్టుబడిన కేసులు నిందితుడిపై ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

కో- ఆప్షన్ సభ్యులకు ప్రొటోకాల్ కల్పించాలి



మాట్లాడుతున్న కొండూరి సత్యనారాయణ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: నూతన మున్సిపల్ చట్టం– 2019 ప్రకారం తెలంగాణలోని మున్సిపల్ కో– ఆప్షన్ సభ్యులను ప్రొటోకాల్ కల్పించాలని తెలంగాణ మున్సిపల్ కో– ఆప్షన్ సభ్యుల రాష్ట్ర ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు కొండూరి సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో ఏర్పాటు చేసిన ఫోరం రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీల్లో ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధుల మాదిరిగానే కో– ఆప్షన్ సభ్యులకు సీఎంఓ నర్సింగ రావు వద్ద ఉన్న ప్రొటోకాల్ ఫైల్ క్లియర్ చేయించాలని కోరారు. పట్టణ ప్రధాన సమస్యల పరిష్కారానికి అభివృద్ధిలో భాగంగా మున్సిపల్ కార్పొరేటర్లు, కౌన్సిలర్‌లతో సమానంగా నిధులు కేటాయించాలని కోరారు. ఫోరం ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయశాస్త్రి, సహ కార్యదర్శి ఎండీ.సలీం, కోశాధికారి బ్రహ్మన్నగౌడ్, లీగల్ అడ్వైజర్ మహ్మద్ హర్షద్‌అలీ, రాష్ట్ర కమిటీ సభ్యులు శోభారెడ్డి, వరలక్ష్మి తదితరులున్నారు.

అలరించిన రాగ నాట్య ఉత్సవం

చిక్కడపల్లి: చిక్కడపల్లి త్యాగరాయగానసభలో ఓల్డ్ బోయినపల్లిలోని రాగాఫైన్ ఆర్ట్స్ అకాడమీ, గానసభ సంయుక్త ఆధ్వర్యంలో రాగ నాట్య ఉత్సవం అలరించింది. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారుల క్లాసికల్ మ్యూజిక్, కర్ణాటక సంగీత కచేరీ, భరతనాట్యం అహుతులను ఆకట్టుకుంది. నృత్య గురువు సంస్థ నిర్వాహకురాలు రంజనిరాగను అతిథులను సత్కరించారు. ఇంటర్ డిస్ట్రిక్ట్ ఎగ్జామినేషన్ సెంటర్ బోర్డు మెంబర్ ఈశ్వరయ్య, డాక్టర్ ఇ.ఎస్. రెడ్డి పాల్గొన్నారు.

పక్కింటి వారిపై చేయిచేసుకున్న వ్యక్తికి 10 రోజుల జైలు

చిక్కడపల్లి: ఇంట్లో గొడవ చేయడంతో పాటు పక్కింటివారిపై చేయిచేసుకున్న యువకుడికి 10 రోజుల జైలు శిక్ష పడింది. ఈ ఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సంజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బాగ్‌లింగంపల్లికి చెందిన బండారి మాధవరెడ్డి (18) ప్రైవేట్ ఉద్యోగి కాగా.. మద్యం మత్తులో ఇంట్లో గొడవపడి పక్కింటి వారిపై చేయిచేసుకున్నాడు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అతడికి 5వ ఎంఎం స్పెషల్ కోర్టు జడ్జి ముందు ప్రవేశపెట్టగా 10 రోజుల సాధారణ జైలుశిక్ష విధించారని సీఐ తెలిపారు.

కేలండర్ ఆవిష్కరణ

నల్లకుంట: తెలుగుభాష చైతన్య సమితి అధ్యక్షుడు బడే సాబ్ ఆధ్వర్యంలో నల్లకుంట శ్రీధర్ ప్లాజాలోని సమితి కార్యాలయంలో నూతన కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్ది ఉత్సవాల వివరాలను వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్ 7,8,9 తేదీల్లో మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు ఉంటాయన్నారు. టీబీహెచ్‌ఎస్ ఉపాధ్యక్షుడు రామకృష్ణ, చంద్రమౌళి, మల్లయ్య, ప్రధాన కార్యదర్శి కల్లేష్, సంపాదకుడు డాక్టర్ జయప్రకాష్, కార్యదర్శులు సత్యనారాయణ, గంట మనోహర్‌రెడ్డి, మల్లికార్జున్, తలారి సురేష్, బాటసారి, ఎస్వీనాయక్, శీనయ్య, సలహాదారులు వెంకటేష్, రాజగోపాల్‌నాయుడు తదితరులున్నారు.

వినతిపత్రం అందజేత

చిక్కడపల్లి: ఆర్టీసీ రూట్ 40 బస్సు మార్గాన్ని తిరిగి యథాతథంగా కొనసాగించాలని కోరుతూ ట్రాఫిక్ సెంట్రల్ జోన్ ఏసీపీ మురళీకృష్ణకు నగర బీజేవైఎం మాజీ అధ్యక్షుడు వినయ్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. 40 బస్సురూట్ దారి మళ్లించడంపై ఇటీవల గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ ట్రాఫిక్ నార్త్‌జోన్ డీసీపీ ప్రకాష్‌రెడ్డిని కలసి వినతిపత్రం ఇచ్చి వివరాలు, రూట్ మళ్లించడంపై కలిగే ఇబ్బందులను వివరించారు. త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తామని ఏసీపీ, సీఐలు హామీ ఇచ్చినట్టు సమాచారం.

సత్కారం

చిక్కడపల్లి: టీఎస్ ఐడీసీ చైర్మన్‌గా నియమితులైన కేంద్రమాజీ మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారిని సిద్ధేంద్ర ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షురాలు డాక్టర్ దేవసేన సోమవారం ఘనంగా సత్కరించారు. స్వచ్ఛంద సంస్థల కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్న ఆయన సేవలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

సన్మానం

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ ఎస్‌టీఆర్ కాలనీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కె.విజయ్‌రావును కృష్ణానగర్ బస్తీ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. బస్తీ అధ్యక్షుడు శాంతికుమార్, ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి స్వామిరావు, జాయింట్ సెక్రటరీ అంజి, కోశాధికారి సుదర్శన్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాము, విజయ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

ముషీరాబాద్: బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ సీనియర్ నాయకులు దర్గా నర్సింగరావు ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు. సోమవారం ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొప్పు భాష నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం రాజ్యసభ సభ్యులు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్‌ను కలిసి శాలువాతో సత్కరించారు. డివిజన్ అధ్యక్షురాలు రాగిణి నరేష్, మహంకాళి జిల్లా కార్యదర్శి శంకర్, ముషీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ రమేష్‌రామ్, కిషోర్, బుక్క రమేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

'భగవద్గీత ప్రపంచానికి మార్గం'

నల్లకుంట: భగవద్గీత ప్రపంచానికి మార్గమని ప్రపంచాన్ని వసుదైవ కుటుంబకంగా మార్చడమే లక్ష్యంగా ఆధ్యాత్మిక విశ్వ విద్యాలయం కృషి చేస్తోందని సుప్రీంకోర్టు న్యాయవాది, ఆధ్యాత్మిక విశ్వ విద్యాలయం ప్రజాపిత బ్రహ్మ కుమార్ (పీబీకే) అమోల్ భాయ్ అన్నారు.

భగవద్గీతలో శరీరం వేరు ఆత్మవేరని ఉందని ఈ రెండూ కలిపి జీవాత్మ అవుతుందన్నారు. ఆధ్యాత్మిక విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో సోమవారం న్యూ నల్లకుంట ఓ ప్రైవేట్ హైస్కూల్‌లో 'శ్రీమద్భగవద్గీత' అంశాలపై ఆధ్యాత్మిక సదస్సును నిర్వహించారు. పీబీకేలు శైలజ, శాంత, విశిష్ట థియోసోఫికల్ సొసైటీ ట్రస్ట్ కార్యదర్శి శ్రీనివాస్, కృష్ణమూర్తి, సీహెచ్ మురళీకృష్ణ, సీహెచ్.లలితాకుమారి, మేధా హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'జీవో 317 రద్దు చేయాలి'

నల్లకుంట: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 317ను ఉద్యోగులు, ఉపాధ్యాయులు వ్యతిరేకిస్తున్నారని వెంటనే ఆ జీవోను రద్దు చేయాలని బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్రశాఖ తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేసింది. ఈ జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మైనార్టీ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం సెకండరీ ఎడ్యుకేషన్ ఎదుట ధర్నా నిర్వహించేందుకు యత్నించారు. సోమవారం సాయంత్రం బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు అఫ్సర్ పాషా, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ముజీబ్‌యాకబ్, మీడియా కన్వీనర్, ఐజాక్‌రాజ్ మాట్లాడారు. శాంతియుతంగా ధర్నా చేసేందుకు వెళ్తున్న తమను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడం అన్యాయమన్నారు.

- జీవో 317 కారణంగా జోనల్ పోస్టులకు సమస్య లేనప్పటికీ జిల్లా క్యాడర్‌కు ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో గందరగోళం నెలకొందని విమర్శించారు.
- ఈ జీవోతో స్థానికతను పట్టించుకోకుండా క్యాడర్ సీనియారిటీని పరిగణలోకి తీసుకోవడం ద్వారా ఉద్యోగ, ఉపాధ్యాయులు దూరప్రాంతాలకు వెళ్లాల్సివస్తుందన్నారు. దీంతో ఉపాధ్యాయ, ఉద్యోగులుగా పనిచేస్తున్న బార్యాభర్తల్లో ఒకరు ఓ జిల్లాకు, మరొకరు ఇంకో జిల్లాలో పనిచేయాల్సిన వస్తుందన్నారు.
- ఈ కేటాయింపు చేసే పద్ధతిని ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను పరిగణలోకి తీసుకోకుండా ప్రభుత్వం ఆ జీవోను జారీ చేసిందని వారు విమర్శించారు. ఈ జీవోను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ మైనార్టీ మోర్చా చంద్రాయణగుట్ట కన్వీనర్ జుబేర్‌ఆలం, ఈశ్వర్ సింగ్, షర్ఫుద్దీన్ అమీనా, నిక్హత్ ఫాతిమా తదితరులున్నారు.

ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



చిక్కడపల్లి: ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని శృంగేరి జగద్గురు మహాసంస్థానం పంచముఖ ఆంజనేయ లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. సోమవారం విష్ణుసహస్రనామపారాయణం, నీరాజనం, ధ్వజారోహణం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మాధికారి కళాజనార్ధనమూర్తి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న దాసుసురేష్ తదితరులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: బీసీలకు చట్టసభల్లో 27 శాతం రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షులు దాసుసురేష్ డిమాండ్ చేశారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని బీసీ రాజ్యాధికార సమితి కేంద్ర కార్యాలయంలో దాసు సురేష్‌ను సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ సమావేశాల సందర్భంగా రాజకీయ రిజర్వేషన్ల సాధన కోసం పెద్దఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ కేంద్రంగా 10 వేల మందితో భారీ బహిరంగ సభను నిర్వస్తామన్నారు. రాజ్యాధికార సమితి రాష్ట్ర నాయకులు బీజీఆర్ నారగోని, ఆనందం, ముత్తయ్యయాదవ్, హరీష్‌గౌడ్, కృష్ణచందర్, కృష్ణయాదవ్, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈబీసీ సంక్షేమ సంఘం ఏపీ చైర్మన్‌గా చెన్న కృష్ణారెడ్డి



నియామక పత్రాన్ని అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: ఎకనామికల్ బ్యాక్ వర్డ్ క్లాస్ (ఈబీసీ) సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చైర్మన్‌గా చెన్న కృష్ణారెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. సోమవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్ఆర్ సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఈ మేరకు ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో జరిగిన సమావేశంలో చెన్నకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఓబీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. ఓబీసీలను సంఘటితం చేస్తూ రాజ్యాధికార దిశగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయనున్నట్లు పేర్కొన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ కృష్ణ, నీలవెంకటేష్, అంజీ తదితరులున్నారు.


ఎయిడెడ్ కళాశాలలను ప్రభుత్వపరం చేయాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

కవాడిగూడ: ఎయిడెడ్ కళాశాలలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్వాధీనం చేసుకుని ప్రభుత్వ కళాశాలలుగా ఏర్పాటు చేయాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పృథ్వీ, హరిప్రసాద్, కార్తీక్ యాదవ్‌లు డిమాండ్ చేశారు. సోమవారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో ఎయిడెడ్ కళాశాలలను ప్రభుత్వం పరం చేయాలని డిమాండ్‌తో ఏవీ కళాశాల నుంచి లోయర్ ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి ఆయన విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కొత్త రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ కేజీ టూ పీజీ ఉచితవిద్య అందిస్తానని కళాశాలలను ప్రైవేట్ పరం చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఎయిడెడ్ కళాశాలల సమస్యలను వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. నాయకులు రేవంత్, గోపాల్‌యాదవ్, పాషా, కమల్ తదితరులున్నారు.

సంప్రదాయ నృత్యకళను ప్రోత్సహించాలి



చిన్నారులతో దైవజ్ఞశర్మ

చిక్కడపల్లి: మన సంప్రదాయ నృత్యకళను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ప్రముఖ సంఖ్యాశాస్త్రవేత్త దైవజ్ఞశర్మ అన్నారు. సాంస్కృతిక విశ్వకళ మండలి మూడో వార్షికోత్సవ వేడుకలు సోమవారం త్యాగరాయగానసభలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఈ సందర్భంగా చిన్నారులను అభినందించి సత్కరించారు. తెలంగాణలో అరుదైన గ్రామీణ కళారూపలున్నాయని వాటికి సాంస్కృతిక సంస్థలు వేదిక కల్పించాలన్నారు. సంప్రదాయ నృత్యకళల్ని, కళాకారులను ప్రోత్సహిస్తున్న సంస్థ ప్రతినిధులను అభినందించారు. కూచిపూడి నృత్య ప్రదర్శనలు, జానపద పాటలు, భక్తిపాటలు, మిమిక్రీ ప్రదర్శనలతో పాటు నిహారిక సాయి శిష్య బృందంచే ప్రదర్శించిన సంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సంస్థ అధ్యక్షులు అలివేలుమంగ, ప్రధాన కార్యదర్శి రాం నర్సయ్య, నటుడు ప్రసాద్, నృత్యగురువు పల్లి, రమేష్, లక్ష్మణరావు, మధు, మమత, సంస్థ ప్రత్యేక సలహాదారులు శ్రీకాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.